

# తానొకటి తలిస్తే...

రచన: "శ్రీ మాలిన్"

క్రిష్ణమ్మ తరంగాలు ఆడుతూ పాడుతూ కలకలరొదతో నురగలు క్రమ్ముతూ కదలిపోతున్నాయి. దినకరుడు అయిదు కొట్టినాక ఆఫీసుగుమస్తాలా పడమరవేపు పెద్దపెద్ద అంగలతో అస్తమిస్తున్నాడు. నది గట్టున కట్టిన గోరీకిచేరువుగా రైలువంతెన కెదురుగా కూచున్న క్రిష్ణారావ్ మనసు కూడ తరంగాలతోపాటు సున్నితంగా సుతి గలుపుతోంది — "శాంత కూడ ఈవాళ షికారువస్తే బావుండేది. ఈ ప్రశాంత వాతావరణపు ఆనందాన్ని అనుభవించే అదృష్టం ఆమెకు యివాళ లేకపోయింది. పెళ్లయి సరిగా సంవత్సరం గడచిపోయి నది ఇంతవరకూ ఏ చీకూ చింతా లేదు. అన్నిటికీ అనువైన ఆ యింటిలో ప్రేమపక్షుల్లా కాలాన్ని తరిమివేస్తున్నాము. నేను నిజంగా అదృష్టవంతుణ్ని అందుచేతనే శాంతవంటి శాంతమూర్తి అందాలరాశి చిరునవ్వులగువ్వను భార్యగా పొందగలిగేను. ఇంతవరకూ శాంత నామాటకు యెదురుచెప్పలేదు. అన్నివిషయాల్లో నేనే పైచేయి లోకంలో సంసారాలన్నీ యింత హాయిగావుంటే "సన్యాశి సుఖి — సంసారి దుఃఖి" అన్న లోకోక్తి ఎందుకువచ్చినట్టు. ఏమో పిల్లా పీచు కలిగినాక ఏరూపం ధరిస్తుందో యీ సంసారం.

నా పిచ్చి కాని! పసిపాపలులేని సంసారము కలువలులేని కొలను వక్కటే. వాళ్ల బోసినోటి చిరునవ్వు చూసినప్పుడే నిజమైన సంసారపు సౌఖ్యం అంటారు అనుభవజ్ఞులు. ఏది యెలావున్నా శాంతవంటి సుగుణవతి భార్యగా లభించినపుడు ఆలోచించవలసిన అవసరమేవుండదు. పాపం! శాంత మావాళ్లకోపాలు తలంచుకుని విచారిస్తుంటుంది. అందుకు ఆమె యేమాత్రం బాధ్యురాలు కాదు. వాళ్లు కాదన్నకన్యను చేసుకొన్నానని కోపం వచ్చింది. శాంత మేనత్త రెండో పెళ్లి చేసుకున్నందుకు శాంతకు శిక్షవిధించాల్సిన అవసరమేమొచ్చింది. శాంతను కాలేజీలో నాకు బాగా తెలుసు. కోతిమూకలవంటి విద్యార్థులమధ్య తోటి ఆడపిల్లలకంటె బాగా మెలగింది, నెమ్మదస్తురాలు, ఒకరిచేత యెప్పుడూ ఒకమాట అనిపించుకోలేదు. మేనత్తచేసినపనికి ఈమెను సంఘంనుండి దూరంగా వుంచాలన్న ఈ సంఘంయొక్క ఉద్దేశమేమిటో. కొడుకు కొత్తకాపురం పెట్టాడు యెలా వున్నాడో చూసివద్దామన్న ఉద్దేశాలుకూడ రద్దుపరచుకొన్నారు మా అమ్మా నాన్న. వాళ్ల కోపాలను అపుకోవలసింది నేను. శాంత అనవసరంగా అనుక్షణం మధనపడుతుంది. నేను యింటి దగ్గర ఉన్నంతసేపూ యేదో కులాసా కాలక్షేపం ఆమెకు. నా చిలిపిచేష్టలకు మురిసిపోతుంది. నేను వేసే విట్సుకి ఉబ్బితబ్బిబ్బవుతుంది. ఇలా ఆలోచించుకొంటూ జలజల జల పారే నీటిలో గులకరాళ్లువేస్తున్న క్రిష్ణారావ్ ఏదో మరచిపోయినవాడిలాలేచి నవ్వుకొంటూ బయలుదేరాడు.

ఉదయం 9 గం॥ లవుతుంది. వీధిలో బండి ఆగిన చప్పుడయింది. ఎదురుగా వాళ్ల అమ్మా నాన్న బండిదిగటం చూశాడు క్రిష్ణారావ్. తాను సంసారం పెట్టినతరువాత యిదే మొదటిసారిగా వస్తున్న అమ్మా నాన్నను ఎలా ఆహ్వానించాలో తెలియక కాసేపు తల్లడిల్లాడు. నవ్వుకొంటూ యెదురుగా వెళ్లి "రా అమ్మా యింట్లోకి యిదేగా రావటం" అంటూ పలకరించాడు. "నీకళ్ల యెదుటే బండి దిగుతూవుంటే 'యిదేనా రావటం' అంటా వేంట్రా" అంటూ ఘర్జించింది వాళ్లమ్మ. ఆదిలోనే ఇంతరాద్ధాంతమయితే అఖరుకు యేమి జరగనున్నదో అనుకొంటూ 'శాంతా! అమ్మా — నాన్నా వచ్చారు' అని కేకవేశాడు తన సంతోషాన్ని వ్యక్తపరుస్తున్న గొంతుతో.

"నీవు పిలవాలట్రా! అది యిపుడు తలుపుచాటునుండి చూడలేదూ .... అన్నీ వేషాలు కాకపోతే!"

"పోనీలేవే! గుమ్మంలో కాలుపెట్టావో లేదో యెందుకీ గొడవ" అంటూ మందలించాడు పాపయ్యశాస్త్రుల్లు.

"అవునండీ నేను మాటాడితేనే గొడవ. అటంబాంబు పడినట్టుంటుంది కామోను మీ చెవిలో. అయినా నాకెందుకు ముసల పీనుగును ఒకమూలను పడుండక అంటూ చేతిలోసంచి క్రిందపడేసి చాపమీద చతికిలబడింది.

ఆఫీసుకు టైమయింది వెళ్ళొస్తా నాన్నా అంటూ చెప్పేసి వెళ్లిపోయాడు క్రిష్ణారావ్.

తాయారమ్మ, పాపయ్యశాస్త్రుల్లు భోజనముచేసి గుమ్మంలో కూచున్నారు. శాంత లోపల భోజనము చేస్తోంది. ఇంతలో 'పోస్టు' అంటూ గుమ్మంలో ఉత్తరంపడేసి వెళ్లిపోయాడు పోస్టుజవాను. గుమ్మంలో పడిన ఉత్తరంతీసి భర్తవేపు అదోలా చూసింది తాయారమ్మ.

"ఏమిటలా క్రిందామీదా చూస్తున్నావ్"

"ఉష్ గట్టిగా మాటాడకండి! కోడల పేర్న ఉత్తరంవచ్చింది చించి చదవండి" అంటూ అందివ్వబోయింది.

"పోనీలేవే కోడలిఉత్తరం మనకెందుకు అమెకే యిచ్చెయ్యకూడదూ!"

"అయ్యోశాతా! చదవంది వాళ్లవుట్టింది వాళ్ళు వ్రాసివుంటారు. గుట్టూ మట్టూ తెలుసుకోటానికి యిదే అదను"

నేను చదవను-కావలిస్తే నీవే చదువు"

తాయారమ్మ ఉత్తరం చించి చదివి కొంప మునిగిపోయినట్టు నోరునొక్కుకొని 'చూశారా అనుకున్నంతపనీ జరుగుతోంది' అంది శాస్త్రుర్లుని వుద్దేశించి.

"ఏమిటే నీ గొడవ"

"ఇంకేముందండి! మన పరువు మట్టిలో కలిసిపోయినట్టే"

"అసి నీ పరువు బంగారంగాను. చదివైనా యేడువు.

"ఈ అప్రాచ్యపు ఉత్తరం నా నోటితో చదవలేను మీరే చదువుకోండి"

"అయితే యింతవరకూ ఆ వుత్తరం నోటితో చదవకపోతే ముక్కుతో చదివావా యేంటి?"

"నాముఖంతో చదివాను. మీ హాస్యాల కేంగాని ముందు అ వుత్తరం చదవండి."

"పైవాళ్ల ఉత్తరాలు చదవటం నాకు అలవాటులేదే చదివినా అర్థంచేసుకోలేను"

"ఇది పైవాళ్ల వుత్తరం కాదండీ! మీ కోడలిగారి కొచ్చిన ప్రేమలేఖ....ప్రేమ" అంటూ యెడమచేత్తో పాపయశాస్త్రుర్ల నెత్తిన పొడిచింది.

"ప్రేమలేఖటే! అయితే యిట్టే అర్థం చేసేపికుంటాను. ఇవ్వాడంటే ముసలివాణ్నయిపోయాను కానీ .... ఆ కాలంలో నీవు రాకముందు రోజుకో ప్రేమలేఖ వ్రావి...."

"అ....వ్రాసివ్రాసి ఏం చేశేవారేంటి"

"అ....ఏం చేశేవాడ్నే....పెరట్లోకి పట్టుకెళ్లి చించిపారేసేవాడ్ని"

"ఓహెూ ఘనకార్యమే చేశారు కాని! ముందు ఆ వుత్తరం అగోరించండి"

"అసలు యీ ఉత్తరం మనదేనా? పోస్టువాడు పొరపాటున పక్కింటివాళ్ల ఉత్తరం మన గుమ్మంలో పడేశాడా? అనవసరంగా చించేశావ్"

"నేను ఎఫ్. ఏ. — బి. ఏ. లు చదవకపోయినా ఆ మాత్రం పోడి యింగ్లీషు ముక్కలు చదవలేనటండీ. తైలుబంతంత లేసి అక్షరాలుంచుకొని మనది కాదంటా రేంటండీ? మీ చాదస్తం!"

"పోయి నా కళ్లజోడు పట్రావే"

"కళ్లజోడుకోసరం యింట్లోకి వెళితే, అ చిత్రాంగి పసిగట్టేస్తుందండీ! ఇందండీ నాకళ్లజోడు" అంటూ ఆమె కళ్లజోడు యివ్వబోయింది.

"ఏడ్చిమొత్తుకున్నట్టుంది నీ తెలివి. నీ కళ్లజోడుకంటే నీ కాళ్లజోడు సరీగా సరిపోతుంది. నీది షార్టు సైటు నాది లాంగ్ సైటు. నీకళ్లజోడుపెట్టుకొంటే నేను యేడవాలితప్ప మరెందుకూ పనికిరాదు"

"అయితే అ వుత్తరం యిలా యివ్వండి తరువాత చదువుదురు గాని. వాడ్ని యింటికిరానీ, ముఖానపడేసి ప్రేమించి పెళ్ళిచేసుకున్న పెళ్లాంగారినాటకం వాడి చేతే చదివిస్తాను" అంటూ పాపయ్యచేతిలోని ఉత్తరం తీసుకొంది తాయారమ్మ.

* * *

క్రిష్ణారావ్ ఆఫీసులో ఫైల్సు తనచుట్టూ దొంతర్లగా పెట్టుకూర్చున్నాడు. పనిచేయ బుద్ధికావటంలేదు. ఫైల్సువిప్పితే యిల్లు కనిపిస్తోంది. కలంకదిపితే శాంతమెదులుతోంది. "ఇంటిదగ్గర యేం పోట్లాటజరుగుతోందో! అసలే శాంత అమాయకురాలు. ఎన్నిమాటలన్నా శిలాప్రతిమలా నుంచొని యేడవటంతప్ప తను నిర్దోషినని చెప్పుకొనే శక్తికూడలేదు. అమ్మ అసలే గొడవమనిషి వట్టినే కేకలువేస్తుంది. అప్పాతే చల్లారిపోతుంది. అతగవలసిందేమైనా వుంటే నన్నడగాలి కాని శాంతమీదెందుకు ధుమధుమలు?' తలలో అలలుమల్లే అల్లుకొంటున్నాయి ఆలోచనలు. గడియారం తన పంక్చువాలిటీకి నిదర్శనంగా నోరతెరుచుకొని ఐదు కొట్టింది. హమ్మయ్యా! అంటూ క్రిష్ణారావ్ సైకిల్‌స్టాండ్‌వేపు వెళ్ళాడు. రోజూ పదియేను నిముషాలలో యిల్లు చేరుకొనేవాడు ఆరోజు యిరవై నిముషాలు పట్టింది. దారిపొడవునా బరువైన ఆలోచనలు.

ఇంట్లోని దృశ్యాన్ని చూసి క్రిష్ణారావ్ వీథిగుమ్మందగ్గరే నిలుచొని కొయ్యబారిపోయాడు. శాంత ఒకగోడకానుకొని యేడుస్తోంది. తాయారమ్మనిలదీసిఅడుగుతోంది, పాపయ్యశాస్త్రుర్లు కళ్లజోడు సవరించుకొని చూస్తున్నాడు.

"రారా నాయనా! అక్కడే మంచుండి పోయావేమి? నీ ముద్దుల పెళ్ళాం వేసే వేషాలు కొంచంచూడు" అంటూ పిలచింది తాయారమ్మ.

"ఏం జరిగిందమ్మా"

"ఏం జరగడమేంటి? అనుకున్నంతా జరిగిపోతోంది. చెప్పండి....అలా కళ్లప్పగించి చూస్తారేమిటి?

"ఏమీలేదురా! కోడలపేర్న ఒక ఉత్తరము వచ్చింది చదువుతా విను....

"ప్రియమైన శాంత!

నీకు లేఖ వ్రాయాలని కలం కాగితం మీద ఆనించాను. ఏమి వ్రాయాలో ఎలా వ్రాయాలో పాలుపోవటంలేదు. నేను లోకంలో అందరికంటే అదృష్టవంతుడ్ని. అందుచేతనే నీలాంటి సుందరాంగి పొందు అందుకోగలిగాను. ప్రపంచంలో ప్రేమికులనేకులున్నారు కాని! నాదృష్టిలోవాళ్లంతా ఒక యెత్తు మనమొక యెత్తు. బహుశా ప్రతిప్రేమికుడూ అలాగే వూహిస్తాడేమో? అయినా మన కదనవసరం. ప్రేమంటే యేమిటో అర్థం తెలియనివాళ్ళు కూడా ప్రేమించుకొంటారు. వాళ్లదృష్టిలో కామవాంఛలే ప్రధానం కాని హృదయం కాదు. హృదయాలను ఒకరి కొకరు అర్పించుకొన్నపుడు వాళ్ళు నిజమైన ఆనందాన్ని పొందుతారు. హృదయమంటే యేమిటని నీ వడగవచ్చు నీ వడగకపోయినా నేను చెప్పవలసిన అవసరం వుంది. నిజం చెప్పాలంటే 'హృదయం' అంటే యేమిటో నిర్వచించటం నాలాంటివాళ్లకు సాధ్యం కానిపని. అయినా నాలోని నమ్మకాన్ని తెలియజేస్తాను.

హృదయము కంటికి కనిపించేవస్తువు కాదు. దానిచేష్టలు శరీరమనే యంత్రము మూలంగా లోకానికి వెల్లడౌతాయి. హృదయములేని శరీరం శరీరంలేని హృదయం కాంతిలేని వస్తువు, వస్తువులేని కాంతి వంటివి. కాంతివున్నపుడే వస్తువుకూడా చూత

గలం. వస్తువు కనిపించినపుడే అక్కడ కాంతి వుందని తెలిసికొంటాం. కాని! కాంతిని శూన్యంలో చూసే శక్తి మనకు లేదు. కనుపించేశక్తి కాంతి కంతకంటే లేదు. కాంతివంటిదే హృదయముకూడా. తినేటపుడు రుచి చూచేది, సంతోషించేటపుడు నవ్వేది, విచారించేటపుడు కన్నీరు కార్చేది హృదయం. కళ్ళు, నాలుక, ముక్కు యివన్నీ హృదయానికి బాహ్యప్రపంచానికి మధ్యగల మధ్యవర్తులు. నీ హృదయం ఒక వ్యక్తికి యెప్పుడైతే అర్పించావో అప్పుడా వ్యక్తి నీకు సర్వకాల సర్వావస్థలయందూ కనిపిస్తునేయుంటాడు. నావేదాంతము నీకు చిరాకు కలిగించవచ్చు. నే చెప్పదలచింది ఒకే వక్క విషయము. నా హృదయము పూర్తిగా నీ వశంచేశాను. నేను స్వతస్సిద్ధముగా నడవలేను, చూడలేను వ్రాయలేను తినలేను నిద్రపోలేను. ప్రతిపనికి నీ చేయూతలేనిదే నేనొక నిర్జీవ ప్రతిమనేమో అనిపిస్తుంది. మొన్న నేను ఆఫీసునుండి వెళ్లిపోతుంటే రోడ్డుమీద యెవరో అమ్మాయి హంసలా నడచిపోతోంది. నీవేమోనని భ్రమపడి 'శాంతా' అని పిలచేను. ఆమె నాముఖంలోకి చూసి "నాపేరు శాంతకాదు 'కాంత' పాపం వికల ప్రేమికుడిలా వున్నావు" జాలిగా నవ్వి నడచిపోయింది. నా యెదలోని రోదనెలా చెప్పుకోను ఆఫీసుఫైల్సులో నీవే కనిపిస్తావు; కాఫీసాసర్లో, బస్సులోని అద్దంలో వాటిగ్లాసుమీదా అన్నిటా నీవే కనిపిస్తావ్. ఇంక "నేను" అన్న మాటే మరచిపోతున్నాను. కలకాలం మన ప్రేమిలాగే చిగురించి పుష్పించి నా జీవితాన్ని నందనవనం చేస్తావని ఆశిస్తున్నాను.

ఇట్లు

నీ ప్రియుడు

"శ్రీరావ్"

పాపయ్యశాస్త్రి ఉత్తరం చదవటం ముగించి కళ్ళజోడు సర్దుకొంటూ మీదకు చూశాడు. క్రిష్ణారావ్ అక్కడలేదు. పెరట్లో స్నానంచేస్తున్నాడు. శాంత కూడా లేదు. పాపయ్య ఆశ్చర్యంగాభార్యవేపుచూశాడు.

"పెళ్ళానికి ప్రేమలేఖవస్తే ఏడికి చీమ చిటుక్కుమన్నట్టు కూడా లేదండి! ఏది మానసం మంటకాను.

"అవునే ఈకాలం కుర్రవాళ్లంతా అంతే! సంఘసంస్కర్తలు ఆడవాళ్ళకు పూర్తిగా స్వేచ్ఛయిచ్చేశారు."

"అవునవును! మీ కుమారరత్నం ఒక సంఘసంస్కర్త. ఇక మీరు...."

"నేను వాడి బాబుని....నీకూ యేమైనా హక్కులు కావాలా యేంటి? ప్రతిపాదించకుండానే యిచ్చేశాను తీసుకో"

క్రిష్ణారావ్ స్నానంచేసివచ్చి ఏదినాన్నా ఉత్తరం ఇలా యివ్వు" అంటూ తీసికొని యింట్లోకి వెళ్లిపోయాడు. అపూట భోజనాలు మౌనంగానే ముగిశాయి.

బయట చలిగాలి జోరుగా వీస్తోంది. ప్రక్కింటిరేడియో 'ఓ తోడులేని చెల్లీ' అంటూ విషాదగీతి ఆలాపిస్తోంది. కిటికీగుండా మల్లిపొదనందులోంచి చందమామ అందంగా కనిపిస్తున్నాడు. క్రిష్ణారావ్ పక్కనములుతూ సిగరెట్టుపొగతో చక్రాలు చేస్తున్నాడు. శాంత తలుపువేసి బిక్కుబిక్కుమంటూ గదిలోనికి వచ్చి విచారంగా నించుంది. గదిలోని గడియారం టిక్కుటిక్కుమంటూ కాలచక్రాన్ని కదుపుతోంది. క్రిష్ణాబాబ్ మౌనముగా ప్రకృతిని పరిశీలిస్తున్నాడు. అయిదు నిందునిముషాలు నిశ్శబ్దముగా దొర్లిపోయాయి. సిగరెట్టు ఆఖరిదమ్ము గట్టిగా పీల్చేసి శేషాన్ని కిటికీలోనుండి బయటకి గిరాటువేస్తు 'శాంతా' అని బొంగురుస్వరంలో నెమ్మదిగా పిలచాడు.

"ఏమండీ?" అంటూ దగ్గరసా వెళ్లింది.

"ఆ ఉత్తరం వ్రాసిందెవరు? అతనికి నీకు యెన్నాళ్ళనుండి పరిచయం? కాలేజీలోనే ప్రేమించావా?"

"ఏమండీ! మీకుకూడ నామీద నమ్మకములేదా! నన్నెందుకిలా పరీక్షిస్తారు?"

"అయితే ఆ ఉత్తరము ఎవరువ్రాసిందీ నీకు తెలియదంటావ్?"

"నాకు తెలియదండి"

"ఇంకా నీవు చదవలేదా?"

"లేదండి! వ్రాసినవాళ్ల పేరుకూడా మీ అమ్మగారు చెప్పలేదు?"

"ఆ తలగడాక్రింద వుంది తీసి చదువుకో హాయిగా!"

"నే చదవనండి ఆ పాడు వుత్తరం. ఎవరో కిట్టనివారు వ్రాసుంటారు మనతో కలహము పెట్టటానికి."

"అయినా ఆ వుత్తరం ఒకసారి చదివి చూడు నీకు తెలిసినవారెవరైనా వ్రాసారేమో దస్తూరిచూసి గుర్తుపట్టుదువు గాని"

శాంత వణుకుతూ ఉత్తరంతీసి చదివింది. క్రిష్ణారావ్ కిటికీవేపు తిరిగి ముసిముసినవ్వులు నవ్వుకొంటున్నాడు. శాంత గట్టిగా నిట్టూర్చి "ఎందుకింత పనిచేశారండి" అంది.

"ఇంత రాద్ధాంతం జరుగుతుందని నాకేం తెలుసు ఆ ఉత్తరం సరాసరి నీకే అందుతుందికదా అని నిన్న టికాటునుండి తిరిగివస్తూ వ్రాసిపడేశాను. ఇవ్వాళ నిన్ను బాగా నవ్వించాలనుకున్నాను. మావాళ్ళు వస్తారు వాళ్ళకందుతుందని నేనేం కలగన్నానా?"

"నవ్వించడంమాటకేం గాని బాగా ఏడిపించారివాళ. మీరిమధ్య శ్రీరావ్ అన్న పేరుతో కథలు వ్రాస్తున్నారన్నసంగతి మీ వాళ్ళకేం తెలుసు. అందుకే నా ప్రాణాలు తీసారు" అంది శాంత భర్తవడిలో ముడుచుకుపోతూ.

"పోనీలే శాంత! ఇంకో ఆరుమాసాలలో పుడతాడుగా ఓ బుడతడు! వాడు చెబుతాడులే వాళ్ళ తాతయ్యకు నాయనమ్మకు బుద్ధి" అంటూ శాంతను తన హృదయానికి అదుముకున్నాడు.

తలుపు సందుగుండా వాళ్ళ సంభాషణ వింటున్న తాయారమ్మ ముక్కుమీద వ్రేలు వేసుకొని "ఆరిపిడుగా" అంటూ పాపయ్యశాస్త్రిదగ్గరకు గబగబావెళ్ళి చెవిలో బుడబుడమంటూ నుడివేసింది.

"నే చెప్పలేదటే తొందర పడవద్దనీ, అంతా ఏడుకొండలవాడి లీల" అంటూ మునుగుతన్నేశాడు ముసలిపాపాయి.

★